సాక్షి
కాకినాడ
మంగళవారం । 18 । ఫిబ్రవరి । 2025



అన్నదానానికి రూ.1.01,116 విరాళం


సామర్లకోట: భీమేశ్వర ఆలయ నిత్యాన్నదాన పథకానికి కె.భాస్కరనారాయణరాజు(కాకినాడ) తన కుమార్తె ఆషా, అల్లుడు కాశీ చరణ్ పేరున రూ.1,01,116 విరాళంగా ఇచ్చారు.



రూ.1,00,016 విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి పప్పు లక్ష్మీనరసింహ మూర్తి (విశాఖపట్నం) రూ.1,00016 విరాళంగా అందజేశారు.

డెల్టా కాలువలకు 8,600 క్యూసెక్కులు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 8,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,600, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,300 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.60 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

జనసేన నేతలపై చార్జిషీటు నమోదు చేయని పోలీసులు

నిరసన వ్యక్తం చేస్తున్న బాధిత కుటుంబం

కరప: ఫీల్డు అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం కేసులో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేసి నాలుగు నెలలైనా ఇంతవరకు బాధ్యులైన జనసేన పార్టీ నాయకులు ముగ్గురిపై చార్జిషీటు నమోదు చేయక పోవడంపై కరప మండలం పెనుగుదురు ఫీల్డుఅసిస్టెంట్ పులపకూర సునీత భర్త వీరబాబు సోమవారం ప్రకటనలో నిరసన వ్యక్తం చేశారు. జనసేన పార్టీ నాయకులు బండారు మురళి (మండల జనసేన పార్టీ అధ్యక్షుడు), ఘంటా నానిబాబు, వీరమహిళ గుబ్బలవీరవెంకటభవానీల వేధింపులు భరించలేక ఫీల్డు అసిస్టెంట్ సునీత గతేడాది అక్టోబర్ నెలలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం పాఠకులకు విదితమే. కాగా అధికారపార్టీ నాయకులు కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఫీల్డు అసిస్టెంట్ భర్త వీరబాబు ఆరోపించారు. కరప పోలీసులు గతేడాది అక్టోబరు నెల 28వ తేదీన ముగ్గురు జనసేన నాయకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. కాకినాడ డీఎస్పీ తన భార్య ఫీల్డుఅసిస్టెంట్ సునీత వాంగ్మూలాన్ని రికార్డు చేశారన్నారు. జరిగిన విషయాన్ని జడ్జి ఎదుట కూడా చెప్పామన్నారు. విచారణలో భాగంగా డీఎస్పీ మండల ఎస్సీ నాయకుల వాంగ్మూలాన్ని కూడా రికార్డు చేశారన్నారు. ఎస్పీ కలుగచేసుకుని పెనగుదురు జనసేన పార్టీ నాయకులు ముగ్గురిపైన చార్జిషీటు దాఖలు చేయాలని కోరారు.

మహిళలకు భద్రత కరవు



మీడియాతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి

తుని: సీఎం చంద్రబాబు ప్రభుత్వంలో మహిళలకు భద్రత కరవైందని తుని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక కోసం కౌన్సిల్ హాలుకు వెళ్లకుండా టీడీపీ శ్రేణులు అడ్డుకోవడంపై కలత చెందిన సుధారాణి మీడియా సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్ సీపీకి ప్రజలు పూర్తి స్థాయి విజయాన్ని అందించారని, ఒక్క సీటు లేని టీడీపీ వైస్ చైర్మన్ కోసం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందన్నారు. రెండు గంటల పాటు ఇంటి నుంచి బయటకు రానివ్వలేదని, కౌన్సిలర్లలో గర్భిణులు ఉన్నా పోలీసులు పట్టించుకోలేదన్నారు. మంగళవారం జరపనున్న ఎన్నికలో 17 మంది కౌన్సిల్ సభ్యులతో ఓటు వేయాలంటే జిల్లా ఎస్పీ, కలెక్టర్ వచ్చి హామీ ఇచ్చి తీసుకువెళితే వెళతామని లేకపోతే వెళ్లబోమని చెప్పారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు పచ్చపాతం చూపడం సరికాదన్నారు. వైఎస్సార్ సీపీకి చెందిన పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం



కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నం చేసుకున్న మందపల్లి శ్రీదేవి

కాకినాడ సిటీ: కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం పురుగు మందు తాగి ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. కాకినాడ పట్టణానికి చెందిన మందపల్లి శ్రీదేవి వైఎస్సార్ ఫ్లై ఓవర్ విస్తరణలో భాగంగా తమ స్థలాలు పోయాయని భావించిన ప్రభుత్వం పక్కనే ఉన్న శ్మశాన భూమి, మరుగుదొడ్డిని పట్టాలుగా ఇచ్చిందని, ఆ భూమి ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేస్తూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ ఆమె కలెక్టరేట్‌లో సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కొందరు వ్యక్తులు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి మా స్థలంపై ఇంజెక్షన్ ఆర్డర్ తెచ్చారని, ఇప్పుడు పోలీసులతో వచ్చి ఖాళీ చేయాలని బెదిరింపులకు దిగుతున్నారని వివరించారు. తమ కుటుంబాన్ని కాపాడాలని, లేదంటే కుటుంబం మొత్తం చనిపోయే పరిస్థితి ఉందని ఓ వినతి పత్రంలో పేర్కొన్నారు. తమకు న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యమటూ ఆమె పురుగుల మందు తాగారు. అక్కడే ఉన్న పోలీసులు, స్థానికులు హుటాహుటిన ఆమెను ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి తరలించి వైద్యం అందజేస్తున్నారు.

కూటమి కుతంత్రం వాయిదా మంత్రం

- వైస్ చైర్‌పర్సన్ పీఠం కోసం **దిగజారుడు**
- లేని అధికారం కోసం ప్రలో**భాలు,** టీడీపీ దౌర్జన్య రాజకీయాలు
- యనమల ఇలాకాలో అడ్డూ అదుపూ లేని అరాచకాలు
- నేడు 'చలో తుని'కి వైఎస్సార్ సీపీ పిలుపు
- ఉమ్మడి తూర్పున శ్రేణులు సమాయత్తం
- కోరం లేక నేటికి వాయిదా : కలెక్టర్
- ఎన్నిక పర్యవేక్షకుడిగా జేసీ మీనా



మాజీ మంత్రి దాడిశెట్టి రాజాపై దాడికి యత్నిస్తున్న టీడీపీ నాయకులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కూటమి కుట్రలు, కుతంత్రాలు, అరాచకాలకు అడ్డు అదుపూ లేకుండా పోతోంది. లేని అధికారం కోసం వెంపర్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాల్జేస్తోంది. ఎన్నికల కమిషన్ ఆదేశాలు తూచా తప్పకుండా అమలుచేసి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు నిర్వహించాలన్న అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను సైతం కాలరాస్తోంది. ప్రజలు ఇచ్చిన తీర్పును తుంగలోకి తొక్కి కరెన్సీ కట్టలు, అధికార బలాన్ని వినియోగించి ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన తుని మున్సిపల్ కౌన్సిలర్‌లను ప్రలోభాలకు గురిచేస్తోంది. జంటిల్‌మెన్ ఒప్పందం ప్రకారం రెండున్నరేళ్ల పదవీ కాలం ముగిసిన మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్-2 పీఠాన్ని పోలీసులను కీలుబొమ్మలుగా మార్చి రౌడీలు, సంఘవ్యతిరేక శక్తులను వెంటేసుకుని తెలుగుదేశం పార్టీ నేతలంతా కట్టకట్టుకుని ఎగరేసుకుపోదామని వేసిన ఎత్తులకు పై ఎత్తులను ఆ నియోజకవర్గ కోఆర్డినేటర్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా నాయకత్వంలో సమర్థవంతంగా తిప్పికొట్టారు. చేసేది లేక చివరకు అధికారబలంతో ఈ నెల 3, 4 తేదీలలో జరగాల్సిన ఎన్నికలను రెండు సార్లు వాయిదా వేయించుకున్నారు. ఇలా రెండు పర్యాయాలు టీడీపీ నేతల కుట్రలు బెడిసికొట్టడంతో మూడోసారి సోమవారం వ్యూహాలకు పదును పెట్టి వైస్‌చైర్‌పర్సన్ పీఠంపై పాగా వేద్దామని గంపెడాశలు పెట్టుకున్నారు. ప్రలోభాలకు గురిచేసి అక్రమ మార్గంలో వైఎస్సార్ సీపీ నుంచి 10 మంది కౌన్సిలర్‌లకు టీడీపీ కండువాలు కప్పి నిస్సిగ్గుగా కౌన్సిల్ హాలులో సమావేశపరిచారు. 30 వార్డులున్న మున్సిపాలిటీలో ఒక్కటంటే ఒక్క స్థానం కూడా లేని టీడీపీ నూటికి నూరుశాతం మెజార్టీ కలిగిన వైఎస్సార్ సీపీని దెబ్బతీయాలనుకున్న తెలుగు తమ్ముళ్ల కుట్రలకు రాజా పక్కా వ్యూహంతో మూడోసారి కూడా చెక్ పెట్టారు.

టీడీపీ కుట్రలకు దీటుగా స్పందన

అడ్డదారిలో తెచ్చుకున్న పది మంది కౌన్సిలర్‌లను కౌన్సిల్ హాలులో సమావేశపరిచి ప్రలోభాలకు లొంగని వైఎస్సార్ సీపీ వెన్నంటి నిలిచిన నలుగురు కౌన్సిలర్‌లను బలవంతంగా తీసుకువచ్చి కోరం చూపించి వైస్ చైర్‌పర్సన్ పోస్టు కొట్టేద్దామని పెద్ద ప్లానే వేశారు. రాజకీయంగా పరిణతి చెందిన రాజా టీడీపీ వ్యూహాలను పసిగట్టి గట్టి ఎదురుదెబ్బ కొట్టడంతో ఆ పార్టీ పాచిక పారలేదు. తొలి నుంచి వైఎస్సార్ సీపీ వెంట ఉన్న18 మంది కౌన్సిలర్‌లను కిడ్నాప్ చేసైనా కౌన్సిల్‌లో కోరం సాధించి వైస్ చైర్‌పర్సన్ పీఠాన్ని తన్నుకుపోవాలని టీడీపీ కుట్ర చేసింది. ఇందులో భాగమే మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి భర్త, కో-ఆప్షన్ సభ్యుడు బాబు సహా పార్టీ నేతలను పోలీసుల బలప్రయోగంతో గృహనిర్బంధం చేశారు. ఈ దురాఘతాలతో కూటమి ప్రభుత్వం తునిలో ఒక రకంగా భయానక వాతావరణాన్ని సృష్టించింది. చివరకు మున్సిపల్ చైర్‌పర్సన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి సహా పలువురు నేతలపై టీడీపీ నాయకులు మోతుకూరి వెంకటేష్ తదితరులతో దౌర్జన్యాలకు కూడా పురిగొల్పింది. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌లు, పార్టీ శ్రేణులు కౌన్సిల్‌కు వెళ్లకుండా దీటుగా స్పందించడంతో తెలుగు తమ్ముళ్లు తోక ముడిచారు. రౌడీ మూకలతో నింపేసిన కౌన్సిల్ హాలులో భౌతిక దాడులకు పాల్పడే అవకాశం ఉందనే సమాచారం, కోర్టు చెప్పినట్టు ప్రశాంతంగా ఎన్నిక జరుగుతుందనే నమ్మకం లేక కౌన్సిలర్‌లు ఎవరూ వెళ్లలేదు. తునిలో టీడీపీ జరుపుతోన్న అరాచకాలను నిరసిస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ స్థాయి అధికారులు రక్షణ కల్పిస్తేనే మంగళవారం జరిపే ఎన్నికకు రాగలుగుతామని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా జిల్లా యంత్రాంగానికి అల్టిమేటమ్ ఇచ్చారు. ఇందుకోసం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నలుమూలల నుంచి 'చలో తుని' కార్యక్రమానికి పిలుపు ఇచ్చారు. **ఈ క్రమంలో పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ ప్రజా మద్దతుతో తునిలో అధికారపార్టీ నేతల ఆగడాలు, అధికార యంత్రాంగం ఏకపక్షంగా వ్యవహరిస్తోన్న తీరును ఎండగట్టేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు చలో తునికి సమాయత్తమవుతున్నాయి.**

వైస్ చైర్‌పర్సన్ అందునా జంటిల్‌మెన్ ఒప్పందంలో రెండున్నరేళ్ల కాలానికి రెండో వైస్ చైర్‌పర్సన్ పోస్టు నూటికి నూరుశాతం మెజార్టీ కలిగిన వైఎస్సార్ సీపీదే. ఆ పోస్టు కోసం అధికారపార్టీ నేతలు ఇన్ని రోజులుగా ఇన్ని కుప్పిగంతులు వేయాలా అని విజ్ఞులు ఆక్షేపిస్తున్నారు. ఒకప్పుడులో టీడీపీలో నంబర్-2గా వెలిగిన యనమల రామకృష్ణుడు ఇలాకాలో ఆయన కనుసన్నల్లోనే ఇన్ని రోజులుగా కుట్ర రాజకీయం జరుగుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసెంబ్లీ స్పీకర్, పీఏసీ చైర్మన్, ఆర్థిక మంత్రి వంటి పదవులు అలంకరించిన యనమల వైస్ చైర్‌పర్సన్ పోస్టు కోసం ప్రజలు ఒక్క సీటు కూడా కౌన్సిల్‌లో ఇవ్వకుండా తిరస్కరించినా ఇంతలా దిగజారిపోవాలా అని తుని జనం ఆక్షేపిస్తున్నారు. ఎన్నిక పర్యవేక్షించేందుకు జేసీ రాహుల్‌మీనాను కలెక్టర్ షన్మోహన్ సగిలి నియమించారు. ఎన్నికల అధికారిగా డీపీఓను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కోరం లేక పోవడంతో ఎన్నికను మంగళవారానికి వాయిదా వేశామని కలెక్టర్ ప్రకటించారు. ప్రజాస్వామ్యంలో కౌన్సిలర్‌లు ఎవరైనా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. ఏమైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

న్యాయం అడిగితే ఎదురు కేసులు

– మాజీ మంత్రి దాడిశెట్టి రాజాపై కేసు

తుని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలో అధికార తెలుగుదేశం పార్టీ అక్రమాలను నిలదీసినందుకు వైఎస్సార్ సీపీ నేతలపై ఎదురు కేసులు పెట్టారు. మూడు పర్యాయాలు అన్యాయంగా వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక జరగకుండా శాంతి భద్రతల సమస్యను సృష్టించిన కూటమి పెద్దలను వెనకేసుకొస్తూ పోలీసులు వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించారు. అధికార పార్టీకి చెందిన నాయకులు, అసాంఘిక శక్తులు దాడి చేస్తాయనే భయంతో మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి ఇంటి వద్దే ఉన్న కౌన్సిలర్లకు ధైర్యం చెప్పేందుకు మాజీ మంత్రి దాడిశెట్టి రాజా వెళ్లారు. తుని పట్టణ పోలీసులు మాత్రం ఇందుకు విరుద్ధంగా కౌన్సిలర్లను నిర్బంధించి ఓటు వేయకుండా అడ్డుకున్నారని మాజీ మంత్రి దాడిశెట్టి రాజాపై ఒక కేసు, పోలిశెట్టి రామలింగేశ్వరావుపై దాడిచేశారంటూ మరో కేసు నమోదు చేయడం గమనార్హం. అధికార పార్టీ అండతో తుని టౌన్ సీఐ ఎం.గీతారామకృష్ణ వ్యవహరించిన తీరును వైఎస్సార్ సీపీ నాయకులు ఖండించారు.

సర్వేలపై మున్సిపల్ కమిషనర్లకు శిక్షణ



సర్వేలపై మున్సిపల్ కమిషనర్లు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

కాకినాడ సిటీ: జిల్లాలో ఉన్న అన్ని మున్సిపా**లిటీల సచివాలయా**ల పరిధిలో ఆరు సర్వేలను **సకాలంలో పూర్తి** చేయాలని జిల్లా అసిస్టెంట్ **కలెక్టర్** హెచ్ఎస్ భావన ఆదేశించారు. ఎంఎస్ఎంఈ, మిస్సింగ్ సిటిజన్ ఇన్ హౌస్‌హోల్డ్స్, జియో ట్యాగింగ్, నాన్ రెసిడెన్సీ ఇన్ ఏపీ, చిల్డ్రన్స్ విత్ ఫుట్ ఆధార్, డెట్‌ఆడిట్ ఇలా పలు సర్వేలను పూర్తి చేయడంలో కాకినాడ నగరపాలక సంస్థ ముందంజలో ఉందన్నారు. కాకినాడ జిల్లాలోని పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం, తుని, గొల్లప్రోలు తదితర మున్సిపాలిటీలు వెనుకబడ్డాయన్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాల మేరకు కాకినాడ కమిషనర్ భావన సూచనలతో ఆయా మున్సిపాలిటీ పరిధిలోని కమిషనర్లు, నోడల్ అధికారులు, సచివాలయాల సిబ్బందికి శిక్షణను కాకినాడ నగరపాలక సంస్థ స్మార్ట్ సిటీ కార్యాలయంలో అదనపు కమిషనర్ కెటి సుధాకర్ నిర్వహించారు. సర్వేలను సకాలంలో పూర్తి చేయకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సర్వేలను సకాలంలో పూర్తి చేయగలిగితేనే ప్రభుత్వ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయవచ్చన్నారు. టీపీఆర్వో శైలజ, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

అనుమతి తీసుకొని కవర్ చేయండి

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లాలో బర్డ్‌ఫ్లూ బారిన పడిన కోళ్ల ఫారాలకు సంబంధించిన వార్తల కవర్ చేసే నిమిత్తం ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా కొంతమంది మీడియా వారు వెళ్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్ షణ్మోహన్ సగిలి సోమవారం తెలిపారు. మీడియా వారు బర్డ్ ఫ్లూ సోకిన కోళ్ల ఫామ్ వార్తలు కవర్ చేయడానికి వెళ్లాలనుకుంటే పశుసంవర్ధకశాఖ అధికారులు, సమాచారశాఖ అధికారులు అనుమతి తీసుకుని సూచనలు, జాగ్రత్తలు తీసుకొని వార్తల కవర్ చేయడానికి వెళ్లాలని, జాగ్రత్తలు తీసుకోకుండా వెళ్లినట్లయితే మిగిలిన కోళ్లకు కూడా ఇన్‌ఫెక్షన్ వ్యాపించే అవకాశం ఉందని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని ధర్నా

కాకినాడ సిటీ: అంగన్‌వాడీ వర్కర్ల రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం కాకినాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా కోశాధికారి మలకా వెంకటరమణ, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎం.రమణమ్మ, ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు నీరజ, జ్యోతి, రాజేశ్వరి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారంలో చొరవ చూపించాలని, తక్షణమే గ్రాట్యూటీ అమలు చేయాలని, పెరిగి ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. ఏళ్ల తరబడి మినీ సెంటర్లలో మెయిన్ సెంటర్లుగా మార్చాలని పోరాటం చేస్తున్నా అమలు చేయడంలేదన్నారు. మెనూ చార్జీలను పెంచి ఇవ్వాలన్నారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, గత ప్రభుత్వ హయాంలో రాసుకున్న మినిట్స్ అంగీకరించిన అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడానికి సిద్ధపడుతున్నామన్నారు. ధర్నా అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఏ జ్యోతికి వినతి పత్రం అందజేశారు. రమ, విజయ, మున్ని, సరోజ, కనకదుర్గ, మేరీ రత్నం, సత్యవతి పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు



ఉత్తమ డ్రైవర్లకు సత్కారం



ఉత్తమ డ్రైవర్లను సత్కరిస్తున్న దృశ్యం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రత మాసోత్సవాలు సోమవారం ముగిశాయి. కాకినాడ ఆర్‌టీసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణాధికారి ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన ముగింపు కార్యక్రమం నిర్వహించగా ట్రాఫిక్ సీఐ రమేష్, రామారావు, ఎంవీఐ హరినాథరెడ్డి హాజరై డ్రైవింగ్ మెళుకువలు నేర్పించారు. కాకినాడ జిల్లా పరిధిలో గల డిపోలు ఏలేశ్వరం, కాకినాడ, తుని ప్రాంతాలకు చెందిన 12మంది డ్రైవర్లను సత్కరించారు.

రత్నగిరిపై భక్తుల సందడి

- సత్యదేవుని దర్శించిన 30 వేల మంది భక్తులు
- రూ.30 లక్షల ఆదాయం
- ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చిన స్వామి, అమ్మవారు

అన్నవరం: వివాహాల సీజన్ సందర్భంగా నవ దంపతులు, వారి బంధుమిత్రులు, ఇతర భక్తులతో ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సోమవారం రద్దీ నెలకొంది. ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున రత్నగిరిపై పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. అదే ముహూర్తాలకు వివిధ ప్రాంతాలలో వివాహాలు చేసుకున్న వారు కూడా సత్యదేవుని సన్నిధికి తరలివచ్చారు. వీరికి ఇతర భక్తులు కూడా తోడవడంతో రద్దీ పెరిగింది. సుమారు 30 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. సత్యదేవుని దర్శనానికి గంట సమయం, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. సత్యదేవుని దర్శించిన అనంతరం



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిలుచున్న భక్తులు

భక్తులు గోశాలలో సప్తగోవులను దర్శించి పూజలు చేశారు. అనంతరం రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షిణ చేశారు. సత్యదేవుని వ్రతాలు 1,500 నిర్వహించగా అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో నాలుగు వేల మందికి భోజనం పెట్టారు.

ముత్తంగి అలంకరణలో సత్యదేవుడు, అమ్మవారు

సోమవారం ముత్యాలతో చేసిన కవచాల (ముత్తంగి) అలంకరణలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీ అమ్మవారు, శంకరుడు భక్తులకు కనువిందు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు రెడీ

- తేలిన ఓటర్ల లెక్క
- ఉమ్మడి 'తూర్పు'లో 1,97,945 మంది ఓటర్లు
- ఈ నెల 27న పోలింగ్
- 285 పోలింగ్ కేంద్రాలు
- ఏర్పాట్లలో అధికారుల తలమునకలు



ఎన్నికల సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఉమ్మడి తూర్పులో ఓటర్ల వివరాలు..

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
తూర్పుగోదావరి	92	36,361	26,606	3	62,970
కాకినాడ	98	42,463	28,072	5	70,504
కోనసీమ	95	37,114	27,355	2	64,471

సాక్షి, రాజమహేంద్రవరం: సార్వత్రిక ఎన్నికల అనంతరం జరగనున్న పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. పోలింగ్ సమయం సమీపిస్తున్న తరుణంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లలో జిల్లా ఎన్నికల అధికార యంత్రాంగం తలమునకలైంది. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు ఇప్పటికే శిక్షణ పూర్తి చేశారు. కలెక్టర్లు ఎన్నికల అధికారులుగా, డీఆర్‌ఓలు సహాయ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు.

తేలిన లెక్క

ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లా అధికార యంత్రాంగం ఓటర్ల జాబితా రూపొందించి ఎన్నికల సంఘానికి పంపింది. ఎట్టకేలకు ఎన్నికలకు ఓటర్ల లెక్క తేల్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 1,97,945 మంది ఓటర్లు తమ హక్కు వినియోగించుకోనున్నారు. పురుషులు 1,15,938, మహిళలు 82,033, ఇతరులు 10 ఉన్నారు. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈనెల 27వ తేదీ నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 285 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 1,97,945 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

మార్చి 3న ఓట్ల లెక్కింపు

పట్టభద్ర ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు మార్చి 3వ తేదీ నిర్వహిస్తారు. అదే రోజు విజేతను ప్రకటిస్తారు. మార్చి 8వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) తప్పకుండా పాటించేలా చర్యలు తీసుకుంటున్నారు. అభ్యర్థుల ప్రచార వ్యయంపై నిఘా పెట్టారు. ఇప్పటికే కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ప్రతి సోమవారం కలెక్టరేట్, జిల్లాలోని ఆర్డీఓ, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహించే గ్రీవెన్స్ రద్దు చేశారు.

పట్టభద్ర ఓటర్లకు అర్హతలు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటు లిస్టులో ఉంటే సరిపోదు. అర్హత పత్రం కలిగుండాలి. ఓటరు ఐడీ కార్డు, పాన్‌కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, డిగ్రీ అర్హతా సర్టిఫికెట్లు, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే వారి హోదాతో జారీ చేసే కార్డులు ఉండాలి. బీఎల్‌ఓలు ఇంటింటా పర్యటించి ఓటరు స్లిప్పులు అందజేస్తారు. స్లిప్‌లు కేవలం ఎంట్రీకి ఉపయోగపడతాయి. ఓటరు తన అర్హత పత్రాల్లో ఏదో ఒకటి తప్పనిసరిగా తీసుకెళ్లాలి.

పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించారు. ఇందుకు గాను ఫారం-12ను జిల్లా రిటర్నింగ్ అధికారికి ఈ నెల 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా సమర్పించాల్సి ఉంది. ఫారంతో పాటు డ్యూటీ కేటాయింపులతో కూడిన ఉత్తర్వుల జిరాక్స్ కాపీలు జతపర్చాల్సి ఉంటుంది.

2 వేల మంది సిబ్బంది

తూర్పు–పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్ర ఎన్నికల నిర్వహణ, పర్యవేక్షణకు ఆరు జిల్లాలకు 2 వేల మంది సిబ్బందిని నియమించారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలో 3,14,984 మంది ఓటర్లు ఉన్నారు. 456 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 70 జోన్లు ఏర్పాటు చేసి.. 70 జోనల్ అధికారులను, 95 మంది రూట్ ఆఫీసర్లను నియమించారు. 456 పోలింగ్ కేంద్రాల్లో ఒక పీఓ, ఇద్దరు సపోర్టింగ్ స్టాఫ్ విధుల్లో ఉంటారు. ఆరు జిల్లాలకు కలిపి 456 ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 456 అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 456 మంది మైక్రో అబ్జర్వర్లు, 456 మంది వెబ్ కాస్టింగ్ చేయనున్నారు. వీరితోపాటు 20 మంది రిజర్వ్ అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉంటారు.

26న పోలింగ్ సామగ్రి తరలింపు

26వ తేదీన ఉదయం పోలింగ్ సామగ్రితో ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లనున్నారు. ఆయా జిల్లాల్లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో 25వ తేదీ రాత్రికే ఏర్పాట్లు చేయనున్నారు.

25న ప్రచారానికి తెర

పట్టభద్ర ఎమ్మెల్సీ అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ సాయంత్రం 4 గంటలకు ప్రచారాన్ని ఆపేయాలి.

బరిలో 35 మంది అభ్యర్థులు

పట్టబద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో 35 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ అనంతరం మిగిలిన అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ పడేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రధానంగా కూటమి, పీడీఎఫ్ అభ్యర్థి మధ్య పోటీ నెలకొంది. మిగిలిన వారు స్వతంత్రులుగా బరిలోకి దిగుతున్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థికి అభినందన



సురేష్‌కుమార్‌ను అభినందిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: న్యూఢిల్లీలో ఈ నెల ఒకటో తేదీ నుంచి 5వ తేదీ వరకు జరిగిన అంతర్జాతీయ వ్యాకో ఇండియా ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీల్లో 14 సంవత్సరాల విభాగంలో బంగారు పతకం సాధించిన కరప మండలం అరట్లకట్ట గ్రామానికి చెందిన యాళ్ల సురేష్‌కుమార్‌ను కలెక్టర్ షణ్మోహన్ అభినందించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇదే స్ఫూర్తితో మరింత ఉన్నత స్థాయికి ఎదిగేందుకు పట్టుదలతో కృషి చేయాలని ఆయన సూచించారు. న్యూఢిల్లీలో ఫోర్త్ వ్యాకో ఇండియా ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ టోర్నమెంట్ కేడి జాదేవ్ ఇండోర్ స్టేడియంలో లైట్, లైట్ కాంటాక్ట్ విభాగంలో ఏడో తరగతి చదువుతున్న సురేష్‌కుమార్‌కు క్రియేటివ్ పోలో గోల్డ్ మెడల్, లైట్ కాంటాక్ట్ విభాగంలో రెండు, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. సురేష్‌కుమార్ చదువుతోపాటు ఆటలను కూడా తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలన్నారు. సురేష్‌కుమార్‌కు రూ.10,000 నగదు బహూకరించేందుకు సంసిద్ధతను తెలియజేశారు. సురేష్‌కుమార్ తండ్రి అంజిబాబును కూడా కలెక్టర్ షణ్మోహన్ అభినందించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	18,500
గటగట (వెయ్యి)	16,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	15,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

పదిలం.. విజయం

- ప్రణాళికతో చదివితే మంచి మార్కులు
- విద్యార్థులకు సబ్జెక్టు నిపుణుల సూచనలు



రాయవరం: పాఠశాల స్థాయిలో పదో తరగతి పరీక్షలు అత్యంత కీలకం. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ విద్యాభ్యాసం సాగించిన విద్యార్థి తొలిసారి ఎదుర్కొనే పబ్లిక్ పరీక్షలు పదో తరగతి లోనే. విద్యార్థుల భవితకు తొలిమెట్టు ఇదే. అలాంటి పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షల్లో ఆయా సబ్జెక్టుల్లో ఎలా ప్రిపేర్ కావాలో నిపుణుల సూచనలు ఇలా..

అడుగులేద్దామిలా..



ఇంగ్లిషు ప్రశ్నపత్రం మూడు విభాగాలుగా ఉంటుంది. గ్రామర్, ఒకాబ్యులరీపై అధికంగా సాధన చేయాలి. సెక్షన్–ఏలో రీడింగ్ కాంప్రహెన్షన్, సెక్షన్–బీలో గ్రామర్ అండ్ ఒకాబ్యులరీ, సెక్షన్–సీలో క్రియేటివ్ రైటింగ్ ఉంటాయి. సెక్షన్–ఏలో 30 మార్కులకు 24 మార్కులు ఆబ్జెక్టివ్ ప్రశ్నలు, ఆరు సాధారణ ప్రశ్నలుంటాయి. పేరాను బాగా చదివి అర్థం చేసుకుంటే కచ్చితంగా 24 మార్కులు స్కోర్ చేయవచ్చు. పాఠ్య పుస్తకాల చివర ఇచ్చే గ్రామర్‌ను బాగా చదివితే 25 మార్కులు ఈజీగా సాధించవచ్చు. క్రియేటివ్ రైటింగ్‌లో లెటర్ రైటింగ్, కాన్వర్సేషన్, స్పీచ్, డైరీ ఎంట్రీ, డబ్ల్యూహెచ్ వర్డ్ ప్రశ్నలు, పేరాగ్రాఫ్ రైటింగ్ ప్రశ్నలకు బాగా సాధన చేయాలి. కొత్త సిలబస్‌తో పాటు, నూతన విధానంలో ప్రశ్నపత్రం ఇస్తారు. నౌన్ మోడిఫయర్స్ కొత్తగా ప్రవేశపెట్టారు.

– ఆర్.వెంకటేశ్వరరావు, జెడ్పీ హెచ్ఎస్, భీమనపల్లి, ఉప్పలగుప్తం మండలం

గణితానికి ఓ లెక్కుంది



గణిత భావనలు బాగా అవగాహన చేసుకుని సూత్రాలపై పట్టు సాధిస్తే గణితమంత సులువైన సబ్జెక్టు మరొకటి ఉండదు. 1, 3, 7, 13, 14 అధ్యాయాలను బాగా అధ్యయనం చేస్తే ప్రతి విద్యార్థి కచ్చితంగా 60 మార్కులు పొందే వీలుంది. ఈ ఐదు చాప్టర్లు గణితంలో పంచరత్నాలుగా భావించాలి. ఈ చాప్టర్ల నుంచే సులభమైన 8 మార్కుల ప్రశ్నలు వస్తాయి. వీటితో పాటు మిగిలిన అధ్యాయాల్లో 1, 2, 4 మార్కుల ప్రశ్నలపై పట్టు సాధిస్తే 100 మార్కులు సులభంగా స్కోర్ చేయవచ్చు.

–టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి (గణితావధాని), జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, అమలాపురం

చరిత్రలో సమాచార విశ్లేషణ ముఖ్యం



నూతన విధానంలో పటాలకు 15 మార్కుల వెయిటేజీ ఉంటుంది. చరిత్ర నుంచి ఒకటి, రెండు పాఠ్యాంశాల్లోని పటాలు, భూగోళం నుంచి 6, 7 పాఠ్యాంశాల్లోని పటాలు చదవాలి. పటాల గుర్తింపు విషయంలో చరిత్రలో 3, 5, భూగోళంలో 1, 6, పౌరశాస్త్రంలో 4, 5, అర్థశాస్త్రంలో 3వ పాఠం అత్యంత ప్రధానమైనవి. 8 మార్కుల ప్రశ్నల విషయానికి వస్తే భూగోళంలో మూడు నాలుగు పాఠాల్లో విషయ అవగాహన కింద వస్తాయి. చరిత్రలో 2, 5 పాఠ్యాంశాల నుంచి అకడమిక్ స్టాండర్డ్–2 కింద ప్రశ్నలు ఇస్తారు. పౌరశాస్త్రంలో ప్రజాస్వామ్యం పాఠ్యాంశం నుంచి సమకాలీన అంశాల్లో ప్రతిస్పందన (అకడమిక్ స్టాండర్డ్–4) అనే అంశంపై ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. అర్థశాస్త్రంలో పట్టికలు, గ్రాఫ్‌లపై విశ్లేషణాత్మక ప్రశ్నలు వస్తాయి. పరీక్షలలో భారతదేశం మరియు ప్రపంచ పటం రెండు అవుట్ లైన్ మ్యాప్‌లను తప్పనిసరిగా గుర్తించాల్సి ఉంటుంది.

– కేఎస్‌వీ కృష్ణారెడ్డి, పాఠ్య పుస్తక రచయిత, జెడ్పీహెచ్ఎస్, ఈతకోట, రావులపాలెం మండలం

రాజభాషలో..



ద్వితీయ భాష హిందీ పరీక్ష పత్రం 6 విభాగాలుగా ఉంటుంది. ఆ విభాగాల నుంచి 100 మార్కులకు ప్రశ్నలు వస్తాయి. మొదటి భాగం నుంచి 12 మార్కులకు పాఠ్య పుస్తకంలోని వ్యాకరణ అంశాలు బాగా ప్రాక్టీస్ చేయాలి. భాగం–2లో కాంప్రహెన్షన్ నుంచి 4 పేరాగ్రాఫ్‌లు ఇచ్చి ఒక్కో పేరాగ్రాఫ్‌కు 5 మార్కుల చొప్పున 20 మార్కులకు ప్రశ్నలు వస్తాయి. పేరాగ్రాఫ్‌లను చదివి బాగా అర్థం చేసుకుని రాయాలి. భాగం–3లో కవి, రచయితల గురించి బాగా చదివి అవగాహన పెంచుకుంటే 10 మార్కులు పొందవచ్చు. 19వ ప్రశ్నగా 'దోహా' మొదటి పాఠం నాలుగు పద్యాల్లో ఒకటి ఇస్తారు. లేఖలో చుట్టీ పత్ర్ తప్పనిసరిగా వచ్చే అవకాశం ఉంటుంది.

– తాహెర్ పాషా, పాఠ్య పుస్తక రచయిత, జెడ్పీహెచ్ఎస్ (బాలికలు), రాజోలు

భౌతికశాస్త్రం.. భయం వద్దు



ఫిజిక్స్‌లో మొత్తం 8 పాఠ్యాంశాల్లో నాలుగు ఫిజిక్స్, నాలుగు కెమిస్ట్రీ పాఠ్యాంశాలున్నాయి. రెండు విభాగాల నుంచి 39 చొప్పున ఛాయిస్‌తో 78 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. కాంతి, ఆమ్లాలు–క్షారాలు పాఠాల నుంచి రెండు పటాలు వస్తాయి. నాలుగు మార్కులు స్కోర్ చేయవచ్చు. లోహాలు – అలోహాలు పాఠం నుంచి 8 మార్కులకు ఒక ప్రయోగం వస్తుంది. విద్యుత్ పాఠం నుంచి 8 మార్కులకు ఒక ప్రశ్న తప్పనిసరిగా వస్తుంది.

–అదబాల వీఎల్ నరసింహారావు, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్, జెడ్పీహెచ్ఎస్, చింతల్లంక, అయినవిల్లి మండలం

తెలుగులో తొమ్మిది సూత్రాలు



తెలుగులో అవగాహన– ప్రతిస్పందనపై నాలుగు ప్రశ్నల ద్వారా 32 మార్కులు సాధించవచ్చు. వ్యక్తీకరణ – సృజనాత్మకత నుంచి నాలుగు మార్కుల ప్రశ్నలు మూడు, ఎనిమిది మార్కుల ప్రశ్నలు మూడు వస్తాయి. వీటి ద్వారా 36 మార్కులు పొందవచ్చు. ప్రధానంగా పద్యభాగంలో కవి పరిచయాలు, గద్యభాగంలో ప్రక్రియలు, రామాయణంలో పాత్రలు చదవడం ద్వారా 12 మార్కులు సాధించవచ్చు. 8వ ప్రశ్నగా కేవలం పద్యభాగ సారాంశాలు, 9వ ప్రశ్నగా రామాయణం, 10వ ప్రశ్నగా సృజనాత్మకత (లేఖ, కరపత్రం) ద్వారా 24 మార్కులు పొందవచ్చు. 32 మార్కులను కేవలం పాఠ్య పుస్తకం వెనుక ఉన్న అభ్యాసాల ద్వారా సాధించవచ్చు. అవగాహన ప్రతిస్పందన నుంచి పరిచిత పద్యం ఆటవెలది, తేటగీతి, కంద పద్యాలు మాత్రమే ఇస్తారు.

– జి.ప్రభావతి, పాఠ్య పుస్తక రచయిత్రి, జెడ్పీహెచ్ఎస్, సఖినేటిపల్లిలంక

బయాలజీలో ఈజీగా..



మారిన సిలబస్‌ను అనుసరించి బయాలజీ ప్రశ్న పత్రం 50 మార్కులకు 17 ప్రశ్నలతో ఉంటుంది. జవాబులు రాసే ముందు ప్రశ్న పత్రాన్ని క్షుణ్ణంగా చదవాలి. సెక్షన్–4లో ప్రయోగాలపై 8 మార్కులకు ఒక ప్రశ్న తప్పనిసరిగా వస్తుంది. అందువల్ల జీవక్రియలు పాఠంపై అవగాహన అవసరం. అనువంశికత పాఠం నుంచి 8 మార్కుల ప్రశ్న వస్తుంది. ఈ రెండు పాఠ్యాంశాలు బాగా చదివితే 16 మార్కులు తప్పనిసరిగా పొందవచ్చు. సెక్షన్–3లో ఒక డయాగ్రామ్ వస్తుంది. ప్రత్యుత్పత్తి పాఠం నుంచి ఒక డయాగ్రామ్ తప్పనిసరిగా వస్తుంది.

–మేకా రామలక్ష్మి, డీసీఈబీ సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్, ఎస్‌జీ మున్సిపల్ ఉన్నత పాఠశాల, మండపేట

క్లుప్తంగా

బాలిక కిడ్నాప్, అత్యాచారం

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం అనాతవరంలో ఎనిమిదో తరగతి చదువుతున్న బాలిక (15)ను ఓ వివాహితుడు కిడ్నాప్ చేసి అత్యాచారం చేశాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.. అనాతవరం గ్రామానికి చెందిన వివాహితుడు పరమట దుర్గాప్రసాద్ (బులి చంటి) సోమవారం స్కూల్‌కు వెళ్తున్న ఆ బాలికను మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేశాడు. అనంతరం అమలాపురం ఎర్రవంతెన సమీపంలో ఒక నివాసానికి తీసుకువెళ్లి అక్కడ ఆమెపై బలవంతంగా అత్యాచారం చేశాడు. బాలిక కిడ్నాప్ అయిన విషయం ఆమె తల్లిదండ్రులు ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై డి.జ్వాలాసాగర్ ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ విషయం తెలిసిన బులి చంటి ఆ బాలికను రూ.20 ఇచ్చి అమలాపురం ఎర్రవంతెన వద్ద అనాతవరం వెళ్లే బస్సు ఎక్కించి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ మేరకు ముమ్మిడివరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్తపై భార్య కత్తితో దాడి



గాయపడిన జ్ఞానేశ్వర్

శంఖవరం: భర్తపై భార్య దాడి చేసిన ఘటన పెదమల్లాపురంలో సోమవారం చోటు చేసుకుంది. ఆ గ్రామానికి చెందిన పిన్నింటి జ్ఞానేశ్వర్ అతని భార్య పిన్నింటి సన్యాసమ్మలకు ముగ్గురు సంతానం. పిల్లలను పాఠశాలకు పంపలేదనే కారణంతో భార్యాభర్తలు గొడవ పడ్డారు. అది కాస్త ముదిరి భర్తపై భార్య కత్తితో దాడి చేసింది. ఈ ఘటనలో భర్త మెడపై తీవ్ర గాయమైంది. తీవ్ర రక్తస్రావంతో ఉన్న జ్ఞానేశ్వర్‌ను బంధువులు హుటాహుటిన 108 అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అన్నవరం ఎస్సై హరిబాబు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

- ఆత్రేయపురంలో పూతరేకుల తయారీపై తనిఖీలు
- ఏడు షాపుల్లో శాంపిల్స్ సేకరణ



ఆత్రేయపురంలో పూతరేకుల దుకాణంలో తినుబండారాలు పరిశీలిస్తున్న ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్

కొత్తపేట: ఆత్రేయపురంలో పూతరేకుల తయారీ కేంద్రాలు, విక్రయ దుకాణాలపై సోమవారం ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ) అధికారులు దాడులు చేశారు. కొంత కాలంగా పూతరేకులు తయారీలో నకిలీ నెయ్యి వినియోగిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు దాడులు జరిపారు. ఫుడ్ సేఫ్టీ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు గ్రామంలో పలు పూతరేకుల తయారీ కేంద్రాల్లో ఏకకాలంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు రొక్కయ్య, సుబ్బారావు, ప్రసాద్, శ్రీకాంత్ చౌదరి టీమ్‌లు ఆకస్మిక తనిఖీలు జరిపారు. ఆయా కేంద్రాలు, దుకాణాల్లో పూతరేకులు తయారీకి వినియోగిస్తున్న నెయ్యిని, సీల్ ప్యాకెట్లను, ఇతర సరకులు, పరిసరాలు, పరిశుభ్రతను, షాపుల్లో పూతరేకులు, ఇతర తినుబండారాలను పరిశీలించారు. బ్రాండ్ నేమ్ లేబుల్ లేని నెయ్యి ప్యాకెట్లను గుర్తించారు. అలా ఒక తయారీ కేంద్రంలో 15 కిలోలు, మరో రెండు షాపుల్లో 142 కిలోల నెయ్యి ప్యాకెట్లు సీజ్ చేశారు. వీటికి సంబంధించి 3 కేసులు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. 7 దుకాణాల్లో పూతరేకుల శాంపిల్స్ సేకరించారు. ల్యాబ్ రిపోర్టులను బట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. లైసెన్స్ లేని 10 షాపుల యజమానులకు నోటీసులు ఇచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ బ్రాండ్ నేమ్ లేని నెయ్యి ప్యాకెట్లు గుర్తించి సీజ్ చేశామన్నారు. తయారీ దారులు లూజ్ ప్యాకెట్లు కొనుగోలు చేసి మోసపోవద్దని, ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడవద్దన్నారు. ప్రతి ఒక్కరూ బ్రాండ్ నెయ్యినే వాడాలని చెబుతున్నామన్నారు. ప్రతి విక్రయదారుడు ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ తీసుకుని వ్యాపారం చేసుకోవాలన్నారు. తద్వారా నాణ్యమైన పూతరేకులు విక్రయించాలన్నారు. కాగా ఫుడ్ సేఫ్టీ అధికారులు గ్రామంలో ప్రవేశించి దాడులు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో మరికొన్ని షాపుల యజమానులు ఆ షాపులను మూసేశారు.

రూ.300 లంచం.. ముగ్గురి సస్పెన్షన్

- కాకినాడ జీజీహెచ్‌లో ఘటన
- రోగి నుంచి లంచం తీసుకోవడంతో చర్యలు

కాకినాడ క్రైం: రోగి నుంచి రూ.300 లంచం తీసుకున్న నేరంలో ముగ్గురు ఉద్యోగులు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి చర్యలు తీసుకున్నారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. కొద్ది రోజుల కిందట ఓ మహిళ కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స (ట్యూబెక్టమీ) కోసం కాకినాడ జీజీహెచ్‌లో చేరింది. ఈ నెల 15న ఆమెకు ఆసుపత్రిలోని ఫ్యామిలీ ప్లానింగ్ థియేటర్‌లో ట్యూబెక్టమీ నిర్వహించారు. శస్త్రచికిత్స చేయడానికి ముందు ఆమెను చికిత్సకు సిద్ధం చేసేందుకు అక్కడ పనిచేస్తున్న రెగ్యులర్ ఎఫ్ఎన్ఓ మోర్తా వీరలక్ష్మి, కాంట్రాక్టు బేసిక్ ఎంఎన్ఓ సీహెచ్ రవితేజలు రూ.300 ఇవ్వాలని డిమాండ్ చేయగా, వారికి పారిశుధ్య కార్మికురాలు మంగ సహకరించింది. శస్త్రచికిత్స ఒత్తిడిలో ఉన్న కుటుంబీకులు డబ్బులు తర్వాత ఇస్తామన్నా కనికరించలేదు. ఇస్తేనే సర్జరీకి సిద్ధం చేస్తామంటూ తేల్చి చెప్పారు. వారి ఒత్తిడితో అప్పటికప్పుడు డబ్బులు ఇవ్వక తప్పలేదు. రూ.300 అందిన తర్వాతే శస్త్రచికిత్సకు సిద్ధం చేయించి ఆపరేషన్ థియేటర్లోకి పంపారు. వీరి నిర్వాకంతో మహిళ కుటుంబం ఎంతో ఆవేదన చెందింది. శస్త్రచికిత్స అనంతరం శనివారం మధ్యాహ్నం మహిళ కుటుంబ సభ్యులు జీజీహెచ్ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా డిప్యూటీ కలెక్టర్, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్ బృందం ఫ్యామిలీ ప్లానింగ్ విభాగానికి వెళ్లి విచారణ చేపట్టింది. బాధితులతో పాటు మరికొందరు వీరు డబ్బులు డిమాండ్ చేయడం, శస్త్రచికిత్సకు ఆటంకం కలిగేలా రోగులను ఇబ్బందులకు గురి చేయడం నిజమేనని చెప్పారు. సాక్ష్యంగా రోగుల అటెండర్లు ఇందుకు సంబంధించిన వీడియో రికార్డింగ్‌లను అధికారులకు అందజేశారు. పకడ్బందీ ఆధారాల నేపథ్యంలో చర్యలు అనివార్యమయ్యారు. ఈ విచారణలో వెలుగుచూసిన అంశాలను డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారికి నివేదించారు. విచారణలోని వాస్తవాల ఆధారంగా లంచం తీసుకున్న మోర్తా వీరలక్ష్మి, సీహెచ్ రవితేజ, మంగలను సస్పెండ్ చేస్తూ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

పండ్ల మార్కెట్‌లో అగ్ని ప్రమాదం



దివాన్‌చెరువులో కాలిపోతున్న పండ్ల గొడౌన్



- మంటలకు ఆహుతైన గొడౌన్
- సుమారు రూ.50 లక్షల నష్టం

రాజానగరం: మండలంలోని దివాన్‌చెరువు పండ్ల మార్కెట్‌లో సోమవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. దీనివల్ల సుమారు రూ.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఏఎస్ఆర్ ఫ్రూట్స్ గొడౌన్ నుంచి అకస్మాత్తుగా మంటలు వ్యాపించి, క్షణాలలో ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. దీంతో దట్టమైన పొగలు ఆకాశాన్ని కమ్మేశాయి. ఆ సమయంలో జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న వారు సైతం కంగారు పడ్డారు. ఇక మార్కెట్‌లో ఉన్నవారు చాలామంది ప్రాణభయంతో అటుఇటు పరుగులు తీశారు. ఈ ప్రమాదానికి కారణం స్పష్టంగా తెలియడంలేదు. గొడౌన్ వెనుక భాగంలో చెత్తను పోగేసి మంట పెట్టడంతో ప్రమాదం జరిగిందని కొందరు, షార్ట్ సర్క్యూట్ వల్ల అని మరికొందరు చెబుతున్నారు. కాగా విషయం తెలుసుకున్న రాజమహేంద్రవరం అగ్నిమాపక దళాధికారి మార్టిన్ లూథర్‌కింగ్ ఆధ్వర్యంలో ఆర్యాపురం, ఇన్నీసుపేట, కొవ్వూరుల నుంచి మూడు అగ్నిమాపక వాహనాలతో సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. గొడౌన్‌లో నిల్వ చేసిన యాపిల్స్, పైనాపిల్స్, ఖర్బూజా, దానిమ్మ, డ్రాగన్ వంటి వివిధ రకాల పండ్లు మంటలకు ఆహుతయ్యాయి. గొడౌన్ వద్ద పార్కు చేసిన రెండు పల్సర్ బైకులు కూడా కాలిపోయాయి. ఈ ప్రమాదం గురించి గొడౌన్ యజమాని ఆరాధ్యుల శ్రీనివాసరావు (ఏఎస్ఆర్) మాట్లాడుతూ రూ. 10 లక్షలతో కొనుగోలు చేసిన వివిధ రకాల పండ్లను గొడౌన్‌లో స్టోర్ చేశామని, అవి ఈ మంటలకు కాలిపోయాయన్నారు. అలాగే 15 వేల విలువైన ప్లాస్టిక్ ట్రేలు ఆనవాళ్లు లేకుండా బూడిదయ్యాయన్నారు. ఈ కేసును బొమ్మూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో తోడి కోడళ్లు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



ప్రమాద స్థలంలో మృతి చెందిన చంద్రమ్మ, రిప్కో

రాజానగరం: రెక్కాడితేగానీ డొక్కాడని బతుకులు వారివి. భర్త సంపాదనకు భార్య సంపాదన కూడా తోడైతేనేగానీ గడవని పరిస్థితిలో భర్తకు సాయంగా కూలికి పోతున్న తోడి కోడళ్లు రోడ్డు ప్రమాదంలో అశువులు బాసి, ఆ రెండు కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చారు. అంతేకాదు ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఒక వ్యక్తి ఆస్పత్రిలో కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. మండలంలోని దివాన్‌చెరువులో జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. కానవరానికి చెందిన కప్పల చంద్రమ్మ (51), కప్పల రిప్కో(55)లు తోడికోడళ్లు. రిప్కో భర్త నాగేశ్వరరావుతో కలసి వారిద్దరూ పాలచర్లలోని నర్సరీలో ప్రతిరోజు కూలి పనికి వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం పని ముగించుకుని ఇంటికి బైక్‌పై తిరిగి వస్తుండగా దివాన్‌చెరువులో ప్రమాదానికి గురయ్యారు. వారు ప్రయాణిస్తున్న బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో కింద పడిన వారి పైనుంచి లారీ దూసుకుపోయింది. దీంతో ఆ ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా, నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతనిని చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మృత్యువులోనూ కలిసే..

తోడి కోడళ్లు అయిన చంద్రమ్మ, రిప్కోలు ఇద్దరు సొంత అక్కచెల్లెళ్ల కంటే మిన్నగా కలిసి మెలసి ఉండేవారని, చివరికి మృత్యులోనూ కలిసే ఉన్నారని ప్రమాద దృశ్యాన్ని చూసిన కానవరం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పోషణ నిమిత్తం దూరంగా కూలికి వెళ్లి, కొద్దిసేపట్లోనే ఇళ్లకు చేరుకుంటారనుకునే లోపే మృత్యువు కబళించడం అందరినీ కలచివేసింది. చంద్రమ్మ భర్త గ్రామంలోనే మేకలను కాస్తుంటాడు. వారికి ఇద్దరు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు. ఇక రిప్కో భర్త నాగేశ్వరరావు కూడా ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. వీరికి ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు. కేసును బొమ్మూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌ల ఢీ

- ఒకరి మృతి
- ఇద్దరికి తీవ్ర గాయాలు



గంటి రాజు (ఫైల్)

అలమూరు/ కడియం: మండలంలోని మడికి నుంచి దుళ్ల వెళ్లే రహదారిలో రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అలమూరు ఎస్సై ఎం.అశోక్ కథనం ప్రకారం.. కడియం మండలం దుళ్లకు చెందిన గంటి రాజు (33), కుమారి దంపతులు తమ వ్యక్తిగత పనిపై కొత్తపేట మండలం మందపల్లి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. స్థానిక షణ్ముక నర్సరీ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వేగంగా వస్తున్న బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో భార్యభర్తలిద్దరికి తీవ్ర గాయాలు కాగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి మరింత విషమంగా మారడంతో మళ్లీ వారిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ భర్త రాజు మృతి చెందగా, భార్య కుమారి మృత్యువుతో పోరాడుతుంది. ఢీకొట్టిన బైక్ యజమానికి కూడా తీవ్ర గాయాలు కావడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అతని వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై అశోక్ తెలిపారు.



మడికి- దుళ్ల రహదారిలో ఢీకొన్న రెండు బైక్‌లు

నాన్న లేదని ఎలా చెప్పేది

వివాహానికి వెళ్లి పది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటామనుకునే సమయంలో దుళ్ల గ్రామానికి చెందిన గంటి రాజు (33) మృతి చెందగా, అతని భార్య కుమారి ఓ ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. కేశవరంలోని ఒక ప్రైవేటు కూల్ డ్రింక్ కంపెనీలో పనిచేస్తూ గంటి రాజు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు భార్య, రెండేళ్ల కుమార్తె ఉంది. ఇంటి వద్ద పాపను వదిలి భార్యతో కలిసి రాజు మందపల్లిలో వివాహానికి శనివారం రాత్రి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఇంటి వద్ద ఉన్న రెండేళ్ల చిన్నారికి నాన్న ఎక్కడని అడిగితే ఏమని చెప్పాలని కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తండ్రి మృత్యువాత పడి, తల్లి ఆసుపత్రిలో ఉండడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదచాయలు అలముకున్నాయి.

ఉల్లాసంగా ఆలిండియా హాకీ పోటీలు



ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో సివిల్ సర్వీసెస్ ఆలిండియా హాకీ పోటీలు మూడోరోజు సోమవారం ఉల్లాసంగా జరిగాయి. ఒడిశా సెక్టార్, హర్యానా మధ్య జరిగిన పోటీలో ఒడిశా 8–0 స్కోర్‌తో, ఉత్తరాఖండ్ సెక్టార్, ఢిల్లీ సెక్టార్ మధ్య జరిగిన ఉత్తరాఖండ్ మ్యాచ్‌లో 4–0 స్కోర్ తేడాతో, బీహార్ సెక్టార్, తెలంగాణ సెక్టార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో బీహార్ సెక్టార్ 15–0 స్కోర్‌తో విజయం సాధించాయి. రాయల్ స్పోర్ట్స్ బోర్డు, ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో రాయల్ జట్టులో ఆనంద రత్నకుమార్ 3, గోవింద్, గణేష్, సుమన్‌లు చెరో ఒక్కొక్క గోల్స్ వేసి జట్టును విజయ పథంలో నడిపించారు.

బీహార్, తెలంగాణ మధ్య జరిగిన మ్యాచ్‌లో బీహార్ 15–0 స్కోర్‌తో, రాజస్థాన్, మధ్యప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 2–0తో, కేరళ, ఏపీ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఏపీ 11–0 స్కోర్‌తో గెలుపొందాయి. పురుషుల విభాగంలో మధ్యప్రదేశ్, తెలంగాణ మధ్య జరిగిన పోటీలో తెలంగాణ 4–3 స్కోర్‌తో, కేరళ–ఢిల్లీ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 9–0, పుదుచ్చేరి–ఒడిశా మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిశా 6–0 స్కోర్‌తో విజయం సాధించాయి. గోవా–మహారాష్ట్ర మధ్య జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర 18–0 స్కోర్‌తో, అహ్మదాబాద్–ఇండోర్ మధ్య జరిగిన మ్యాచ్ 2–2 స్కోర్‌తో డ్రాగా ముగిసింది. సోమవారం నిర్వహించిన మ్యాచ్‌లను టోర్నమెంట్ కో–ఆర్డినేటర్, డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్, హాకీ సంఘ ప్రతినిధి రవిరాజు పర్యవేక్షించారు.